www.prajasakti.com

ప్రజాశక్తి

ఆదివారం 15 జూన్ 2025

5

తూర్పుగోదావరి



ట్రాన్స్‌ఫార్మర్‌పై లతలు తొలగింపు

ప్రజాశక్తి వార్తకు స్పందన

ప్రజాశక్తి - గోపాలపురం



శుభ్రపడిన ట్రాన్స్‌ఫార్మర్

గోపాలపురం - వేలంచితంగుడెంలో అంబేద్కర్ గురుకుల పాఠశాల కాంపౌండ్ బయటవైపు ఏర్పాటుచేసిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను లతలు అల్లుకుపోయాయి. దీనిపై శనివారం ప్రజాశక్తి దినపత్రికలో 'ప్రమాదకరంగా విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్' అంటూ వెలుగులోకి తెచ్చిన కథనంపై విద్యుత్ శాఖ ఎఇ డి.శ్రీనివాసరావు స్పందించారు. ట్రాన్స్‌ఫార్మర్ వద్ద ప్రమాదకరంగా ఉన్న ఉన్న పిచ్చి మొక్కలను, పొదలను, దట్టమైన తీగలను తొలగించారు. దీనిపై స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.

తల్లికి వందనంకు ఆంక్షల బంధనం

కూటమి ప్రభుత్వం ఎట్టకేలకు అమలు చేస్తన్న 'తల్లికి వందనం' పథకం ఆంక్షల బంధనాలతో నీరుగారుతోంది. లేనిపోని నిబంధనలు పెట్టి లబ్ధిదారుల సంఖ్యను తగ్గించుకునే ప్రయత్నం చేస్తోంది. గత ప్రభుత్వం ప్రవేశపెట్టిన నిబంధనలను విమర్శించిన కూటమి... నేడు అవే నిబంధనలను అమలు చేస్తూ ప్రజలను మోసం చేస్తోంది. వైసిపి సర్కారు రూ.వేయి కోతపెడితే... తామేమీ తక్కువ కాదంటూ ఏకంగా రూ.2వేలకు ఎగనామం పెట్టింది. ఎన్నికల ముందు... నీకు 15.. నీకు 15 .. అంటూ ప్రచారం చేసి... అమల్లోకి వచ్చేసరికి నీకు పదమూడే.. నీకు పదమూడే.. అనే రీతిలో వ్యవహరిస్తోంది.



- జిల్లాలో1.24 లక్షల మందికి లబ్ధి
- ఆంక్షలతో పలువురు దూరం
- ఔట్ సోర్సింగ్, కాంట్రాక్టు ఉద్యోగుల పిల్లలకు కోత
- స్కీమ్ వర్కర్ల పిల్లలకు పథకానిన్ని దూరం చేసిన సర్కారు

ప్రజాశక్తి - కొవ్వూరు

కూటమి ప్రభుత్వం ఏర్పాటై ఏడాది తరువాత 'తల్లికి వందనం' పథకం అమలుకు ఎట్టకేలకు శ్రీకారం చుట్టింది. గత వైసిప సర్కారు మరుగుదొడ్ల నిర్వహణ పేర అమ్మఒడి సొమ్ముల్లో రూ.1000 కోత పెట్టింది. దీనిపై అప్పట్లో కూటమి నాయకులు తీవ్ర గగ్గోలు పెట్టారు. నేడు వరే తల్లికి వందనంలో ఏకంగా రూ.2వేలు కోత విధించారు. దీనిపై విద్యార్థి సంఘాలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి. ఫీజు రీయింబర్స్‌మెంట్ పొందుతున్న కుటుంబంలో విద్యార్థులను పథకం నుంచి మినహాయించడం విమర్శలకు తావిస్తోంది. ఫీజు రీయింబర్స్‌మెంట్ సొమ్ములు ఇవ్వకుండానే తల్లికి వందనం కోత విధించడాన్ని విద్యార్థి సంఘాలు తప్పుబడుతున్నాయి. నిబంధనల పేరుతో విద్యార్థుల సంఖ్యను తగ్గించుకోవాలనే ప్రయత్నాలు మానుకోవాలని సూచిస్తున్నాయి. ప్రయివేటు స్కూళ్లలో చదువుతున్న విద్యార్థులకు తల్లుల ఖాతాలో కాకుండా నేరుగా స్కూలు యాజమాన్యాల ఖాతాలకు చెల్లించాలనే యోచనపైనా విమర్శలు వెలువెత్తుతున్నాయి. ప్రస్తుతం రెండో తరగతి నుంచి 10వ తరగతి వరకు మాత్రమే అర్హులైన విద్యార్థులనే గుర్తించారు. 2025-26 ఒకటో తరగతి, పదవ తరగతి పూర్తయి ఇంటర్మీడియట్లో చేరే విద్యార్థులకు జులై 5 నాటికి పంపిణీ చేస్తామంటున్నారు. 75 శాతం హాజరు ఉన్న విద్యార్థులను అర్హులుగా ప్రకటించారు. 1000 చదరపు అడుగుల విస్తీర్ణంలో ఇల్లు ఉన్నవారు, మూడు ఎకరాల మాగాణి ఉన్నవారిపై అనర్హత వేటు వేశారు. ఒక జిల్లా జాబితాలో ఉన్నవారు వేరొక జిల్లాలో మ్యాపింగ్ అయినవారినీ అనర్హులుగా ప్రకటించారు.

వివిధ ప్రభుత్వ శాఖల్లో పనిచేసే ఔట్ సోర్సింగ్, కాంట్రాక్ట్ ఉద్యోగుల పిల్లలు ఈ పథకానికి అనర్హులుగా గుర్తించారు. మున్సిపాలిటీలో పనిచేసే పారిశుధ్య కార్మికుల పిల్లలకు సైతం ఇదే నియమాన్ని వర్తింపజేసి అనర్హులను చేయడంతో ఆ సంఘ ఎ నాయకులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పారిశుధ్య కార్మికులకు ఆదాయ పరిమితితో సంబంధం లేకుండా పథకాన్ని అమలు చేయాలని కోరుతున్నారు. ఇంజినీరింగ్ విభాగం, వాటర్ వర్క్స్ తదితర విభాగాల్లో పనిచేస్తున్న ఔట్ సోర్సింగ్ సిబ్బంది, స్కీమ్ వర్కర్ల పిల్లలదీ ఇదే పరిస్థితి. నెలకి 300 యూనిట్లు పైబడి వినియోగించిన వారిని సైతం తల్లికి వందనం పొందడానికి అనర్హులుగా ప్రభుత్వం గుర్తించింది.

తల్లికి వందనం కోత విధించొద్దని సిపిఎం ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసింది. గ్రామాల్లో ఏడాదికి రూ.2.5 లక్షలు, పట్టణాల్లో రూ.3 లక్షల ఆదాయం ఉన్న కుటుంబాలకు ఈ పథకాన్ని వర్తింపజేయాలని డిమాండ్ చేసింది.

జిలా వ్యాప్తంగా ఒకటి నుంచి ఇంటర్మీడియట్ వరకు చదువుతున్న 1,12,779 మంది లబ్ధిదారులను అధికారులు గుర్తించారు. మరో 1,352 లబ్ధిదారుల ఖాతాలు ఆధార్‌తో అనుసంధానం కాకపోవడంతో పెండింగ్‌లో ఉంచారు. పెండింగ్‌లోని లబ్ధిదారుల వివరాలను అధికారులు సరి చేస్తున్నారు. అర్హులందరికీ ఈ పథకాన్ని వర్తింపజేస్తామని ఐటి, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ప్రకటించారు. లబ్ధిదారుల ఖాతాలో సొమ్ములను రానున్న రెండు మూడు రోజుల్లో వరుసగా జమ చేస్తామని చెప్పారు. నిధులు జమ కాకపోతే సోమవారం నుంచి జూన్ 26వ తేదీ లోపు మళ్లీ దరఖాస్తు చేసుకోవాలని ఆయన సూచించారు. వాట్సప్‌లోని మన మిత్ర యాప్ ద్వారా గాని జెఎస్‌డబ్ల్యూఎస్ సైట్ ద్వారా గాని దరఖాస్తులను సరి చూసుకోవాలని అధికారులు చెబుతున్నారు.

• అర్హతలు ఇవే...

తల్లికి వందనం పథకం వర్తించాలంటే లబ్ధిదారుడు రాష్ట్రానికి చెందిన వారై ఉండాలి. పాఠశాలకు, కళాశాలకు వెళుతున్న వారై ఉండాలి. తల్లితోపాటు విద్యార్థికి ఆధార్ కార్డు కలిగి ఉండాలి. కచ్చితంగా బ్యాంకు ఖాతాకు ఆధార్ లింక్ అయి ఉండాలి. తల్లి పేరుతో అకౌంట్ ఉండాలి. విద్యార్థి పుట్టిన ధ్రువీకరణ పత్రం కలిగి ఉండాలి. ప్రభుత్వ, ప్రయివేటు పాఠశాల, జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం చదువుతున్న విద్యార్థులు అర్హులు.

300 యూనిట్లు దాటాయని ఆపేశారు

మాది రెండు పోర్షన్ల ఇల్లు. రెండు కుటుంబాలు ఉంటున్నాము. వేసవి నేపథ్యంలో గత నెల వాడకం ఎక్కువగా ఉండటంతో 325 యూనిట్లు విచ్చంది. ఎనిమిది నెలలకు సంబంధించి ఈ నెల మాత్రమే 300 యూనిట్లు దాటింఇ. సరాసరిలో మొత్తంగా 300 యూనిట్లకు పైగా రావడంతో తల్లికి వందనం నిలిపేశారు. విద్యుత్ ఛార్జీలను రెండు కుటుంబాలు కలిపి చెల్లిస్తున్నాము. ఒకే మీటర్ ఉండటంతో పథకానికి దూరం అయ్యాము. ఇలాంటి నిబంధనలను సడలించాలి. విద్యుత్ వాడకానికి తల్లికి వందనం లింకు పెట్టడం ఎంతవరకూ సబబు.

- జంగా శ్రీరమ్య, ధవళేశ్వరం

• డబ్బులు పడలేదా..? ఇలా ఎలా చెక్ చేసుకోండి...

తల్లికి వందనం లబ్ధిదారుల కోసం ప్రభుత్వం ప్రత్యేకంగా బెనిఫిట్ స్టేటస్ చెక్ అందించింది. ముందుగా https://gsws-nbm.ap.gov.inలో పేమెంట్ ఆప్షన్‌పై క్లిక్ చేయాలి. మీ ఆధార్ నెంబరు లేదా రేషన్ కార్డు నెంబర్‌ను ఎంటర్ చేయాలి. సబ్మిట్‌పై క్లిక్ చేసిన వెంటనే మీ అకౌంట్‌లోకి డబ్బులు జమయ్యాయా లేదా అన్నది తెలుస్తుంది. బ్యాంక్ అకౌంట్‌కు ఆధార్ నెంబర్లు లింక్ అయినా మొబైల్‌కు మెసేజ్ కూడా వస్తుంది. మీ స్టేటస్‌లో చెక్ చేసుకుని కొత్తగా దరఖాస్తు చేసేవారు కూడా అప్లై చేసుకోవచ్చు.

• ఎలా దరఖాస్తు చేయాలి

2025 నూతన దరఖాస్తులను ప్రభుత్వం ఎన్‌బిఎం పోర్టల్‌లో దరఖాస్తులు స్వీకరిస్తుంది. ముందుగా https:@||gsws-nbs.ap.gov.in సైట్‌ను ఓపెన్ చేయాలి. లబ్ధిదారుడి ఆధార్ వివరాలు, బ్యాంక్ అకౌంట్‌ల వివరాలు, పిల్లల వివరాలు ధ్రువీకరణ పత్రాలు అప్‌లోడ్ చేసి సబ్మిట్ చేయాలి. వివరాలు మీ మొబైల్ యాప్ ద్వారా చెక్ చేసుకోవచ్చు.



ముగింపు సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎంపి డాక్టర్ మిడియం బాబూరావు

సామాజిక పుస్తకాలు చదవాలి

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

విద్యార్థులు పాఠ్య పుస్తకాలతో పాటు సామజిక పుస్తకాలు చదవాలని మాజీ ఎంపి డాక్టర్ మీడియం బాబూరావు పిలుపునిచ్చారు. బాలాజీ దాస్ విజ్ఞాన కేంద్రం (బివికె) ట్రస్ట్ ఆధ్వర్యంలో స్థానిక ఎస్‌కెవిటి ఇంగ్లీషు మీడియం పాఠశాలలో ఎస్‌ఎఫ్ఐ, యుటిఎఫ్ సహకారంతో జూన్ ఒకటి నుంచి నిర్వహించిన వేసవి శిక్షణా తరగతులు శనివారంతో ముగిశాయి. ఈ ముగింపు సభలో మాజీ ఎంపి డాక్టర్ మీడియం బాబూరావు పాల్గొని మాట్లాడారు. గవర్నమెంట్ పాఠశాలల్లో చదువుకుని ప్రతి విద్యార్థికి మంచి చదువు అందించాలని ఆయన చెప్పారు. బట్టీ పట్టి చదివించే పద్ధతి నడుస్తున్న ఈరోజుల్లో విద్యార్థులకు మంచి సబ్జెక్ట్ అందించాలి అన్న లక్ష్యంతో గత తొమ్మిదేళ్లుగా వేసవి శిక్షణా తరగతులు నిర్వహిస్తున్నామని తెలిపారు. ట్రస్ట్ బోర్డ్ సభ్యులు టి.అరుణ్ మాట్లాడుతూ జిఎస్.బాలాజీదాస్ స్వాతంత్ర సమరయోధుడిగా, విద్యార్థి నాయకుడి నుంచి కార్మిక నాయకుడుగా ఎన్నో ప్రజా ఉద్యమాలు నిర్వహించారని తెలిపారు. బివికె వేసవి శిక్షణా తరగతులు గత తొమ్మిది సంవత్సరాల నుంచి విజయవంతంగా జరగడానికి యుటిఎఫ్, ఎస్ఎఫ్ సహకారం కీలకం అన్నారు. ఈ క్యాంపునకు వచ్చిన విద్యార్థులు కేవలం మంచి సబ్జెక్ట్‌నే కాకుండా నాయకత్వ లక్షణాలను నేర్చుకుంటారని అన్నారు.ఎస్‌ఎఫ్ఐ మాజీ జిల్లా కార్యదర్శి బి.పవన్ మాట్లాడుతూ ఈ శిక్షణా తరగతులకు వస్తున్న విద్యార్థులందరూ మంచి మార్కులతో ఉత్తీర్ణులు అయ్యారని అన్నారు. అలాగే విద్యార్థులు కేవలం పాఠ్యపుస్తకాల్ని కాకుండా సమాజ సాహిత్యం చదవాలని, సమాజంలో జరిగే మార్పులను అధ్యయనం చేస్తూ ఉండాలని అన్నారు. యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎ.షరీఫ్ మాట్లాడుతూ వేసవి శిక్షణ తరగతులకు ప్రతి సంవత్సరం యుటిఎఫ్ ఉపాధ్యాయిలే ఉచితంగా విద్యార్థులకు పాఠాలు బోధిస్తున్నారని అన్నారు. ఆ ఉపాధ్యాయులందరూ వేసవి సెలవులను కుటుంబం కోసం కాకుండా సమాజం కోసం, విద్యార్థుల కోసం కేటాయిస్తున్నారని అన్నారు. అలాగే ప్రతి సంవత్సరం ఇలాగే మా సహకారం అందిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు వై.భాస్కర్, ఎన్.రాజా, శిక్షణా తరగతుల్లో పాఠాలు బోధించిన ఉపాధ్యాయులు ఐ.విజయబాబు, జి.శేఖర్, కె.శ్రీనివాస్, పి.రవివర్మ, ఎస్.పట్నాయక్, ఐ.వినోద్, ఎమ్.అప్పలరాజు, బి.మధు, ఐ.అనిల్‌కుమార్ మాట్లాడారు. విద్యార్థులు ప్రణాళికతో, శ్రద్ధగా చదివి మంచి ఫలితాలు సాధించాలని అన్నారు. శిక్షణా తరగతుల నిర్వహణలో భాగమైన ఎస్‌ఎఫ్ఐ నాయకులు జోసెఫ్, జ్యోతి, కార్తీక్, హేమంత్, లహరిలను ట్రస్ట్ నిర్వాహకులు అభినందనలు తెలిపారు.



సమావేశంలో పాల్గొన్న ఉపాధ్యాయులు



పండ్ల తోటల పెంపకానికి ప్రోత్సాహం

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం రూరల్

జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం ద్వారా పండ్ల తోటల పెంపకం చేపట్టేందుకు అర్హులైన సన్న/చిన్నకారు రైతుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని కలెక్టర్ పి.ప్రశాంతి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. పూర్తి వివరాలు, తగిన సూచనలు సలహాలు కోసం మండల పరిధిలోని ఉద్యానవన అధికారులను సంప్రదించాలని సూచించారు. గత ఏడాదిలో 500 ఎకరాలు లక్ష్యాన్ని నిర్దేశించుకున్నామని, దానికి మించి 643 ఎకరాల్లో పండ్ల తోటల పెంపకం చేపట్టామని అన్నారు. ఈ ఏడాది 2,100 ఎకరాల్లో సాగు చేసేలా లక్ష్యంగా తీసుకున్నట్లు తెలిపారు. జిల్లాలో మామిడి, జీడిమామిడి, ఆయిల్ పాం, డ్రాగన్ ఫ్రూట్, నిమ్మ, బత్తాయి, కొబ్బరి, సపోటా, సీతాఫలం, కోకో వంటి తదితర 26 రకాల పండ్ల తోటల పెంపకానికి అనుమతించడం జరిగింద న్నారు. మూడేళ్ల నిర్వహణ ఖర్చును రాష్ట్ర ప్రభుత్వం రైతులకు ఉచితంగా చెల్లించను న్నట్లు తెలిపారు. రైతులకు కల్పించే లబ్ధి కింద వివిధ రూపాల్లో పండ్ల రకాలను బట్టి ఒక ఎకరానికి మూడేళ్లకు రూ.68,103 నుంచి రూ.2,51,226 వరకూ ఇవ్వనున్నారని తెలిపారు. జూన్ 25వ తేది లోపు రైతులు తమ దరఖాస్తులను గ్రామ ఫీల్డ్ అసిస్టెంట్/గ్రామ పంచాయతీ కార్యదర్శి, మండల పరిషత్ కార్యాలయంలో అందజేయాలన్నారు.

నగరాభివృద్ధిపై ప్రత్యేక దృష్టి

రౌండ్ టేబుల్ సమావేశంలో ఆదిరెడ్డి

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం ప్రతినిధి

2027 గోదావరి పుష్కరాల ద్వారా రాజమహేంద్రవరం నగరాన్ని సమగ్రంగా అభివృద్ధి చేసేందుకు కృషి చేద్దామని ఎంఎల్ఎ ఆదిరెడ్డి శ్రీనివాస్ అన్నారు. 2027 గోదావరి పుష్కరాలు నగర సమగ్ర అభివృద్ధిపై ఛాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు తవ్వా రాజా ఆధ్వర్యంలో శనివారం రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. మాజీ అధ్యక్షుడు దొండపాటి సత్యంబాబు అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. చిరు వ్యాపారుల కోసం ఎంపిక చేసిన ప్రాంతంలో ట్రాఫిక్‌కు ఇబ్బంది లేకుండా సామూహిక వ్యాపారం చేసుకోవాలని కోరుతామని అన్నారు. గోదావరిలో ఎక్కడ స్నానం చేసిన పుణ్యమేనని దీనిని భక్తులకు విస్తృత ప్రచారం చేయాలన్నారు. నగరంలో 25 ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేశామని, సబ్ స్టేషన్లు ఏర్పాటు చేస్తామన్నారు. ప్లాస్టిక్ నిర్మూలనకు కృషి చేస్తున్నామని, ప్రజలు సహకరించాలని కోరారు. నవంబర్‌లో 50 ఎంఎల్‌డి వాటర్ ప్లాంట్ ప్రారంభమవుతుందన్నారు. వచ్చే పుష్కరాల్లో భక్తుల రద్దీని తగ్గించడానికి పుష్కర నగర్లు ఏర్పాటు చేస్తున్నామని, భక్తులకు భోజనాలు, మరుగుదొడ్లు, మౌలిక వసతులు ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. వైసిపి నాయకురాలు జక్కంపూడి విజయలక్ష్మి మాట్లాడుతూ గత పుష్కరాల్లో జరిగిన తప్పిదాలను పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. రాజకీయాలకు అతీతంగా పుష్కరాలు జరగాలనీ, ముంపు ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. ఆర్‌డిఒ కృష్ణనాయక్ మాట్లాడుతూ గోదావరి పుష్కరాలను అన్ని వర్గాల ప్రజలతో, అన్ని రాజకీయ పార్టీల సహకారంతో, సాంకేతిక పరిజ్ఞానంతో ముందుకు వెళ్తామన్నారు. మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ కేతన్ గర్గ్ మాట్లాడుతూ నగర పాలక సంస్థ ఆధ్వర్యంలో దశలవారీగా మౌలిక వసతులను అభివృద్ధి చేస్తున్నామన్నారు. ఎఎస్‌పి సుబ్బరాజు మాట్లాడుతూ గోదావరి పుష్కరాలకు వచ్చే భక్తుల రద్దీ నియంత్రణకు స్వచ్ఛంద సేవకులుగా మాజీ సైనికులు, పోలీసులను వినియోగిస్తే బాగుంటుందన్నారు. ఎపిఇపిడిసిఎల్ ఎస్ఇ తిలక్ మాట్లాడుతూ అన్ని ప్రధాన ఘాట్లలో అండర్ గ్రౌండ్ విద్యుత్ కేబుల్స్ ఉంటాయని తెలిపారు. రుడా మాజీ ఛైర్‌పర్సన్ మేడపాటి షర్మిలారెడ్డి, సీనియర్ జర్నలిస్టు కృష్ణకుమార్, కాంగ్రెస్ పార్టీ నాయకులు అసదుల్లా అహ్మద్ మాట్లాడారు. ఈ సమావేశంలో వివిధ పార్టీలకు చెందిన నాయకులు కంటిపూడి సర్వారాయుడు, కురగంటి సతీష్, వై శ్రీను, జామి సత్యనారాయణ, కాశి, నల్లం శ్రీను, వర్రే శ్రీనివాస్, కోళ్ల బాబు, టికె.విశ్వేశ్వర రెడ్డి, మజ్జి రాంబాబు, బుడ్డిగ రాధా, అశోక్ కుమార్ జైన్, పొలసానపల్లి హనుమంతరావు, కొల్లేపల్లి శేషయ్య, ఆకుల శ్రీనివాస్, క్షత్రియ బాలసుబ్రమణ్యం తదితరులు మాట్లాడారు.



రౌండ్ టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న ఎంఎల్ఎ ఆదిరెడ్డి వాసు

తాగునీటి సరఫరాకు ప్రాధాన్యత ఇవ్వాలి : సిపిఎం

పుష్కర నిధులతో నగర ప్రజల అవసరాలకు తగ్గట్లుగా తాగునీటి వ్యవస్థను ఆధునీకరించాలని సిపిఎం జిల్లా కార్యదర్శి టి.అరుణ్ కోరారు. అఖిలపక్ష సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. 2011 జనాభా లెక్కల ప్రకారం నగర ప్రజలు 3.50 లక్షలు కాగా గడిచిన 14 సంవత్సరాలలో సుమారు 2 లక్షల జనాభా పెరిగినట్లు తెలుస్తోందన్నారు. అధికారిక గణాంకాల ప్రకారం ప్రతి మనిషికి రోజుకు 145 లీటర్లు నీరు అవసరం ఉందని, ప్రస్తుతం నగరంలో ఉదయం 30 నిమిషాలు సాయంత్రం 30 నిమిషాలు మినహా నీరు సరఫరా చేసే పరిస్థితి లేదన్నారు. ధవళేశ్వరం, కోటిలింగాల పేటలలోని 10 ఎంఎల్‌డి ప్లాంట్లలో జనరేటర్‌లు లేకపోవటంతో విద్యుత్ సరఫరా నిలిచిపోయిన ప్రతిసారీ సరఫరాలో ఇబ్బందులు తలెత్తుతున్నాయని అన్నారు. సుమారు 480 కిలో మీటర్ల పైప్‌లైన్ల ద్వారా నీటి సరఫరా జరుగుతోందని, 3 దశాబ్దాల క్రితం ఏర్పాటు చేసిన ఈ పైప్‌లైన్‌లు ప్రస్తుతం అవసాన దశకు చేరుకున్నాయని గుర్తు చేశారు. ఫలితంగా తాగునీటి సరఫరాలో తరచూ ఇబ్బందులు తలెత్తుతున్నాయని గుర్తు చేశారు. నగరంలో విలీనమైన ప్రాంతాలకు గోదావరినీరు అందించటం లేదని, పుష్కరాల నేపథ్యంలో విడుదలయ్యే నిధులలో తాగునీటి వ్యవస్థను ఆధునీకరించేందుకు తొలి ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు. ధవళేశ్వరంలో నిర్మిస్తున్న మురుగునీటి శుద్ధి కేంద్రాన్ని త్వరితగతిన పూర్తి చేయాలని కోరారు. చాంబర్ ఆఫ్ కామర్స్ ఆధ్వర్యంలో నగరాభివృద్ధిపై అఖిలపక్షంతో చర్చ ఏర్పాటు చేయటం అభినందనీయమని అన్నారు.

రెడ్ క్రాస్ ఆధ్వర్యాన ర్యాలీ

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం



ర్యాలీ నిర్వహిస్తున్న రెడ్‌క్రాస్ వలంటీర్లు

ప్రపంచ రక్తదాతల దినోత్సవం సందర్భంగా ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ రామచంద్ర ఆర్‌కె ఆధ్వర్యంలో కళాశాలలో రెడ్ క్రాస్ వాలంటీర్లు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మానవహారంగా ఏర్పడి రక్తదాతల కోసం ప్రతిజ్ఞను చేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ రామచంద్ర, యూత్ రెడ్ క్రాస్ కోఆర్డినేటర్ జి.రవితేజ మాట్లాడారు. రక్తదానం చేయడం వలన హృదయ సంబంధమైనటువంటి వ్యాధులను దూరం చేసుకోవచ్చునని అన్నారు. దేహంలో ఉన్నటువంటి కొవ్వును తగ్గించుకోవచ్చునని, కాలేయ వ్యాధులను దరిచేరకుండా చేసుకోవడానికి ఆస్కారం ఉంటుందన్నారు. జిజిహెచ్ వైద్యులు డాక్టర్ సుజాత మాట్లాడుతూ విద్యార్థులు రక్తాన్ని దానం చేసే గుణాన్ని అలవాటు చేసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో రెడ్ క్రాస్ వాలంటీర్లుతోపాటు, సాయి నర్సింగ్ కాలేజ్ మొదటి సంవత్సరం విద్యార్థులు పాల్గొన్నారు.

యోగా ట్రయల్ రన్‌కి అపూర్వ స్పందన

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం రూరల్

జిల్లా వ్యాప్తంగా శనివారం నిర్వహించిన యోగా ట్రయల్ రన్‌కు అపూర్వరీతిలో స్పందన లభించిందని జాయింట్ కలెక్టర్ ఎస్.చిన్నరాముడు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా వ్యాప్తంగా 3 మున్సిపల్, 300 గ్రామ పంచాయతీలు, ముఖ్య కూడళ్లలో, స్కూల్స్, కాలేజీలు యూనివర్శిటీ, 1645 ప్రాంతాల్లో 1,06,847 మందితో యోగా సాధన కార్యక్రమం జరిగిందన్నారు. యోగా సాధన కోసం 4,889 ప్రాంతాల్లో యోగాంధ్ర కార్యక్రమం జూన్ 21 అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని అత్యంత ఘనంగా నిర్వహించేలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు.

రోడ్డుపై రద్దును తొలగించిన సిబ్బంది

'ప్రజాశక్తి వార్తకు స్పందన'

ప్రజాశక్తి - కడియం



రద్దును ఎత్తివేయడంతో బాగుపడిన రోడ్డు

స్థానిక శ్రీగర్ కాలనీలో రెండు నెలల క్రితం డ్రెయినేజీపై స్లాబ్‌ను వేసిన పంచాయతీ సిబ్బంది పాత స్లాబ్ రద్దును మాత్రమే రహదారి మధ్యలోనే వదిలివేశారు. దీనిపై 'ప్రజాశక్తి'లో శనివారం రోడ్డుపైనే రద్దు శీర్షికతో ప్రజలు పడుతున్న ఇబ్బందులను వెలుగులోకి తెచ్చింది. దీనిపై స్పందించిన పంచాయతీ అధికారులు రహదారి మధ్యలో ఉన్న రద్దును తొలగించారు. స్థానిక ప్రజలు సంతోషం వ్యక్తం చేశారు.

నీట్‌లో మోహిత్‌శ్రీరామ్‌కు 56 ర్యాంకు

ప్రజాశక్తి - చాగల్లు



నీట్‌లో ఆల్ ఇండియాలో 56 ర్యాంకు, స్టేట్లో రెండో ర్యాంకును చాగల్లు గ్రామానికి చెందిన కొడవటి మోహిత్‌శ్రీరామ్ సాధించాడు. జెఎన్‌టియుకె ఆధ్వర్యంలో నిర్వహించిన ఎపి ఇంజనీరింగ్ అండ్ అగ్రికల్చర్ ఫార్మసీ కామన్ ఎంట్రన్స్ పరీక్షలకు హాజరైన మోహిత్‌శ్రీరామ్ ఆల్ ఇండియా స్థాయిలో 56, స్టేట్లో రెండో సాధించడం పట్ల పలువురు అభినందనలు తెలిపారు. మోహిత్‌శ్రీరామ్ తండ్రి సత్యనారాయణ మాట్లాడుతూ పూర్వం నుంచి తమ కుటుంబం రైతు కుటుంబమని, తన కుమారుడిని ఉన్నత చదువులు చదివించాలనే కోరికతో చదివించామని తెలిపారు. ఈ ర్యాంకు సాధించడానికి తన కుమారుడు ఎంతో కష్టపడ్డాడని సంతోషం వ్యక్తం చేశారు. మోహిత్ శ్రీరామ్ మాట్లాడుతూ ఒకటి, రెండు తగరతులు చాగల్లులోనే చదువుకున్నానని, 3 నుంచి 8 వరకూ నిడదవోలు శశిలోనూ, 9 నుంచి ఇంటర్మీడియట్ వరకు శశి వేలివెన్నులో చదువుకున్నట్లుతెలిపారు. పాలిటెక్నిక్(2023)లో స్టేట్ ఫస్ట్ వచ్చిందన్నారు. నీట్‌లో ఆల్ ఇండియాలో 56 ర్యాంకు, స్టేట్‌లో రెండో ర్యాంకు రావడం పట్ల సంతోషంగా ఉందన్నారు. ఈ ర్యాంకు సాధించడానికి గురువులు, తల్లిదండ్రులు ఇచ్చిన ప్రోత్సాహం ద్వారానే సాధ్యపడిందన్నారు.

కార్టూ'నిజం'



మద్యం సిండికేట్ల అండదండలతో బెల్ట్‌షాపులు

ప్రజాశక్తి - కోరుకొండ



ఎంఎల్ఎ బలరామకృష్ణ

రాజానగరం నియోజకవర్గంలో బెల్ట్‌షాపులు ఎక్సైజ్ అధికారులు, మద్యం సిండికేట్ అండదండలతో కొనసాగు తున్నాయని ఎంఎల్ఎ బత్తుల బలరామకృష్ణ ధ్వజమెత్తారు. శనివారం స్థానిక జనసేన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నియోజవర్గంలో బెల్ట్ షాపులు నడుస్తున్నాయని, వీటి వెనక మద్యం షాపులు యాజమాన్యంతోపాటు ఎక్సైజ్ శాఖల అండదండలు పుష్కలంగా ఉన్నాయని అన్నారు. నియోజకవర్గంలో బెల్టు షాపులు అరికట్టకపోతే మద్యం షాపులు యాజమాన్యంపైన, ఎక్సైజ్ శాఖ అధికారులపైనా చర్యలు తీసుకోవడం జరుగుతుందని ఆయన హెచ్చరించారు. జిల్లా, మండల స్థాయి ఎక్సైజ్ శాఖ అధికారులపై సిఎం, డిప్యూటీ సిఎం, ఎక్సైజ్ శాఖ మంత్రికి ఫిర్యాదు చేయనున్నట్లు తెలిపారు. పాఠశాలలు, దేవాలయాల వద్ద మద్యం విక్రయాలు జరిగితే ఊరుకునేదిలేదన్నారు. నియోజవర్గంలో ఎక్కడ బెల్టు షాపులు కనబడకూడదన్నారు. బెల్టు షాపుల విషయంలో కూటమి నాయకులు చెప్పిన ఎవరిని విడిచి పెట్టేది లేదన్నారు. అధికారులు పట్టించుకోకపోతే తానే బెల్ట్ షాపులు పట్టుకుంటానన్నారు. రాష్ట్రంలో కూటమి పాలనలో సంక్షేమం, అభివృద్ధి సమపాళ్లలో కొనసాగుతుందన్నారు. సూపర్ సిక్స్ పథకాల్లో భాగంగా తల్లికి వందనంలో అర్హులైన వారికి నగదును జమ చేయడం జరిగిందని తెలిపారు. అర్హులైన వారికి నగదు చేరకపోతే వాట్సప్ గవర్నెన్స్‌లో గాని, సచివాలయంలో గాని ఫిర్యాదు చేసుకోవాలని సూచించారు. సాంకేతిక పరమైన ఇబ్బందులు ఉంటే తన దృష్టికి తీసుకురావాలని కోరారు. గత ఏడాది కాలంగా నియోజకవర్గంలో దోపీడీలు, బ్లేడ్ బ్యాచ్‌ల ఆగడాలు లేకుండా ప్రశాంతంగా ఉందని తెలిపారు. త్వరలోనే నియోజకవర్గంలో ఇండస్ట్రీయల్ పార్క్ ఏర్పాటు చేయనున్నట్లు ప్రకటించారు.



పిచికారి చేస్తున్న వైద్య సిబ్బంది

దోమల నివారణా మందు పిచికారీ

ప్రజాశక్తి - గోకవరం

ప్రభుత్వ వసతి గృహాల్లో దోమల నివారణకు ఐఆర్ఎస్‌ను పిచికారి చేశారు. ఈ సందర్భగా గోకవరం, కొత్తపల్లి పిహెచ్‌సి వైద్యులు డాక్టర్ తీరన్ మాట్లాడారు. గోకవరంలోని ఎస్‌టి. పోస్ట్ మెట్రిక్ బోయ్స్ హాస్టల్, ఎస్‌టి. బాలికల పోస్ట్ మెట్రిక్ హాస్టల్, వీరలంకపల్లిలోని డాక్టర్ బిఆర్.అంబేద్కర్ బాలికల గురుకుల పాఠశాలలో దోమలు నివారణకు దోమలు మందు పిచికారి చేయడం జరిగిందన్నారు. మండలంలోని అన్ని ప్రభుత్వ వసతి గృహాల్లో ఈ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో హాస్టల్స్ వార్డెన్స్ సూర్యం, సాంభుడు, మంజులావేణి వాణి, వైద్య సిబ్బంది, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

విద్యుదాఘాతంతో లారీ మెకానిక్ మృతి

ప్రజాశక్తి - రావులపాలెం

విద్యుత్ షాక్ తగిలి లారీ మెకానిక్ మృతి చెందిన ఘటన రావులపాలెం మండలం రావులపాడులో శుక్రవారం రాత్రి జరిగింది. ఎస్ఐ ఎస్.రాము తెలిపిన వివరాలిలా ఉన్నాయి. అంబాజీపేట మండలం కమ్ముకువారి లంక గ్రామానికి చెందిన వాసంశెట్టి పల్లంరాజు (50) రావులపాలెం మండలం రావులపాడులోని మురళీకృష్ణ ఆటో గ్యారేజ్ పేరుతో లారీ మెకానిక్ పనులు చేస్తుంటాడు. షెడ్డు వద్ద శుక్రవారం పల్లంరాజు టిప్పర్ లారీకి రిపేరు చేస్తుండగా లారీ డ్రైవర్ కోటేశ్వరరావు ఎలాంటి సమాచారం ఇవ్వకుండా లారీ లిఫ్టు క్యాబిన్ పైకి లేపాడు. దీంతో లారీ లిఫ్టు పైన ఉన్న 11 కెవి విద్యుత్ తీగలు తగిలి విద్యుత్ షాక్‌తో మురళీకృష్ణ అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుని భార్య వాసంశెట్టి వల్లలమ్మ శనివారం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రాము తెలిపారు.

చెట్టు పైనుంచి పడి వ్యక్తి మృతి

ప్రజాశక్తి - మామిడికుదురు

నగరంలో తాడి వారి మెరకకు చెందిన తాడి అశోక్ కుమార్(35) శుక్రవారం కొబ్బరి చెట్టుపై నుంచి పడి తీవ్రంగా గాయపడ్డాడు. అతన్ని కుటుంబ సభ్యులు రాజోలు ప్రభుత్వ హాస్పటల్ కు తరలిస్తుండగా మృతి చెందాడు. మృతుని భార్య నాగమణి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్ఐ ఎ చైతన్య కుమార్ శనివారం తెలిపారు పెయింటర్ గా జీవనోపాధి పొందుతున్న మతుడు పిల్లలకు అనారోగ్యంగా ఉండడంతో బొండం కోసం చెట్టు ఎక్కి పడిపోయి తీవ్రంగా గాయపడ్డాడు. అశోక్ కుమార్ మృతితో భార్య, 15 ఏళ్ల కుమార్తె స్వప్న, 13ఏళ్ల కుమారుడు సంతోష్ నిరాశ్రయులయ్యారు. మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించారు

298 అడవి తాబేళ్లు స్వాధీనం

ప్రజాశక్తి - గోకవరం

స్థానిక మెయిన్ రోడ్డు పక్కన గల కాజ.రామ్‌కుమార్‌కు చెందిన స్థలంలో అనుమానాస్పదంగా ఉన్న 7 గోనె సంచులలో ఉన్న 298 సముద్రపు తాబేళ్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. తాబేళ్లను అక్రమ రవాణా చేసే వారిని గుర్తించి వారిపై చర్యలు తీసుకుంటామని ఎస్ఐ పవన్‌కుమార్ తెలిపారు. తాబేళ్ల సంరక్షణ నిమిత్తం అటవీ శాఖ అధికారులకు అందజేసినట్లు తెలిపారు. వన్య ప్రాణులను అక్రమ రవాణా చేసే వారిపై నిఘా పెట్టామని తెలిపారు.

గంజాయి తరలిస్తున్న ముఠా అరెస్ట్

ప్రజాశక్తి - కొవ్వూరు

గంజాయిని తరలిస్తున్న ఏడుగురు సభ్యుల ముఠాను శనివారం రోడ్ కం రైలు వంతెన సమీపంలో అరెస్టు చేసినట్లు సిఐ పి.విశ్వం తెలిపారు. ఈ కేసుకు సంబంధించిన వివరాలను ఆయన మీడియాకు వెల్లడించారు. వీరి నుంచి 26 కిలోల గంజాయిని, రెండు కత్తులు, రూ.1,130 నగదు, ఐదు సెల్‌ఫోన్లు, రెండు ఇనుప రాడ్లు స్వాధీనం చేసుకున్నామన్నారు. ఈ తినమంత్ర మండలం మార్టేరు గ్రామానికి చెందిన పాకా వంశీ, తణుకు పట్టణానికి చెందిన ఇజ్జాడా పాపి నాయుడు, పెరవలి మండలం అజ్జరం గ్రామానికి చెందిన మర్రి శామ్యూల్, పాలంగి సుబ్బరాజు, కాండ్రేగుల గురుప్రసాద్, పెరవలికి చెందిన చిన్నమిల్లి శివకృష్ణ, సవరపు ప్రవీణ్‌ను అరెస్ట్ చేసినట్లు సిఐ తెలిపారు. ఈ ఏడుగురు సభ్యుల ముఠా శ్రీకాకుళం జిల్లా చిలకపాలెంలో బంగారు దుకాణం లూటీ చేయడానికి ప్రణాళిక సిద్ధం చేసుకున్నట్లు విచారణలో తేలింది అన్నారు. ముఠాను అరెస్టు చేయడంలో తాళ్లపూడి ఎస్ఐ రామకృష్ణ, కొవ్వూరు ఎస్ఐ టి.రామకృష్ణ పాల్గొన్నారు.


ధర్నా చేస్తున్న ఆర్ఒబి ప్రాంత ప్రజలు

బురదమయం ఆర్ఒబి ప్రాంతం ధర్నాకు దిగిన స్థానికులు

ప్రజాశక్తి - నిడదవోలు

గత ఏడాదిన్నరగా పట్టణంలో నిర్మిస్తున్న ఆర్ఒబి వల్ల ప్రజలు, వ్యాపారస్తులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. ఈ నేపథ్యంలో వర్షాలు ప్రారంభం కావడంతో ప్రస్తుతం ఆ ప్రాంతం బురదమయంగా మారిపోతుంది. దీంతో వాహనదారులు ప్రమాదాల భారిన పడుతున్నారు. ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం కలుగుతోంది. ఈ నేపథ్యంలో శనివారం స్థానికులు ధర్నాకు దిగారు. ఈ ధర్నాకు సిపిఎం నాయకులు జువ్వల రాంబాబు, జనసేన నాయకులు రంగా రమేష్ మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా అధికారులను, కాంట్రాక్టర్‌ను నిలదీశారు. ఈ సందర్భంగా రాంబాబు మాట్లాడుతూ ఆర్ఒబి నిర్మాణం జరిగే అన్ని రోజులు భారీ వాహనాలు ఇటు వైపుకి రాకుండా నిషేధించాలని డిమాండ్ చేశారు.


పూడికతీత పనులను పర్యవేక్షిస్తున్న సర్పంచ్ రాంజీ

ముంపు నివారణకు ప్రణాళిక

ప్రజాశక్తి - కడియం

గ్రామంలోని పల్లపు ప్రాంతాలు నీట మునగకుండా ముందస్తు ప్రణాళికలతో డ్రెయిన్లలో పూడిక తీత కార్యక్రమాన్ని చేపట్టినట్లు కడియపులంక సర్పంచ్ పాతంశెట్టి రాంజీ తెలిపారు. శనివారం గ్రామంలోని పూడిక తీత పనులను ఆయన పరివీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల కురిసిన వర్షాలకు డ్రెయినేజీలో చెత్త, ప్లాస్టిక్ వ్యర్థాలు, అధికంగా పేరుకుపోయాయన్నారు. దీనితో డ్రెయినేజీలో మురుగునీటి ప్రవాహానికి ఆటంకం ఏర్పడి ప్రజలు ఇబ్బందులు పడకుండా పూడికలను తొలగిస్తున్నట్లు తెలిపారు. అలాగే ప్రజలు ఇళ్లల్లోని చెత్తను డ్రెయిన్లలో వేయరాదని, ప్రతీ ఇంటికి చెత్తను తీసుకెళ్లేందుకు సిబ్బంది వస్తున్నారని తెలిపారు.

సంక్షేమంలో కోత..పన్నులతో వాత..

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం ప్రతినిధి

ఏడాది పాలనలో సంక్షేమం కోత, పన్నుల పెంపుతో వాత పెట్టిన కూటమి పాలకులు తమది సుపరిపాలన అంటూ చేస్తున్న ప్రచార ఆర్భాటం వారి చిత్తశుద్ధికి దర్పణం పడుతోంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది గడిచిన విషయం విధితమే. ఈ నేపథ్యంలో ప్రభుత్వం చేసిన ప్రచారం మిన్నంటింది. అయితే ఏడాది పాలనను సమీక్షించుకుంటే సామాన్యులకు ఒరిగిందేమీ లేదనేది సుస్పష్టం. ఎన్నికల ముందు ప్రకటించిన సూపర్ సిక్స్ నేటికీ పూర్తి స్థాయిలో పట్టాలెక్కలేదు. తాజాగా విడుదల చేసిన అమ్మ ఒడిలోనూ షరతుల మెలిక అనేకమంది లబ్ధిదారులను దూరం చేస్తోంది. విద్యార్థుల ఫీజు రియంబర్స్‌మెంట్ ఊసే లేదు. దీంతో కాలేజీ యాజమాన్యాలు సర్టిఫికెట్లు జారీ నిలిపివేయటంతో పట్టభద్రుల పరిస్థితి అయోమయంగా మారింది. ఖరీఫ్ సాగు ప్రారంభమైనా నేటికీ సుఖీభవ రాకపోవటంతో పెట్టుబడి ఖర్చుల కోసం రైతులు ఆశగా ఎదురు చూస్తున్నారు. తాజాగా ఆస్తి పన్నులు అసాధారణంగా పెంచుతూ విడుదల చేసిన జిఒ పట్టణవాసులకు కంటిమీద కునుకు లేకుండా చేస్తోంది. గత ప్రభుత్వం ఏడాదికి 10 శాతం పెంపును వ్యతిరేకిస్తూ విమర్శలు గుప్పించిన టిడిపి అధినేత తాజాగా 35 శాతం వరకూ పన్నులు పెంచుతూ జిఒను విడుదల చేయటం విస్మయానికి గురి చేస్తోంది. ఈ నేపథ్యంలో ఇంటి యజమానులు సైతం అద్దెల రూపంలో పన్నులు చెల్లించే దుస్థితి తలెత్తింది. అద్దెదారులపై పరోక్షంగా ఈ భారం పడనుండటంలో ఎటువంటి సందేహమూ లేదు. 'విద్యుత్ ఛార్జీలు పెంచబోము అవసరమైన మేరకు తగ్గిస్తామంటూ ఇచ్చిన హామీ విద్యుత్ వినియోగదారులను వెక్కిరిస్తోంది. ఇప్పటికే సర్దుబాటు భారాలు రెండు సార్లు తెరలేపిన ప్రభుత్వం స్మార్ట్ మీటర్ల బాంబును అంటించింది. ఇప్పటికే వాణిజ్య సంస్థలకు ఛార్జీల మోత మోగుతోంది. తాజాగా గృహ వినియోగదారులకు స్మార్ట్ మీటర్లు ఏర్పాటు చేసేందుకు సమాయత్తమవుతోంది. మొత్తంమీద మూలిగే నక్కపై తాటికాయ పడ్డ చందంగా ప్రజల పరిస్థితిని దిగజార్చిన ప్రభుత్వం తొలి ఏడాది పేరుతో సంబరాలు చేయటం క్షేత్రస్థాయిలో ప్రజలతో పాటు, కూటమి కార్యకర్తలను కలవరానికి గురిచేస్తోంది.

ఎట్టకేలకు తల్లికివందనం

కూటమి ప్రభుత్వం ఎట్టకేలకు విడుదల చేసిన తల్లికి వందనం విమర్శలకు దారితీసింది. గత ప్రభుత్వం నాలుగేళ్లు అమ్మఒడి పేరుతో ఇదే పథకం అమలు చేసిన విషయం విధితమే. ఇంట్లో ఎంతమంది పిల్లలు ఉంటే అంత మందికీ అమలు చేస్తామని చెప్పిన కూటమి నేతలు అధికారంలోకి వచ్చిన ఏడాది వరకూ ఈ పథకం ఊసెత్తలేదు. తాజాగా అమలు చేసినప్పటికీ నిబంధనలలో ఎటువంటి సడలింపూ చేయలేదు. ఇది చాలదన్నట్లుగా ఇంట్లో ఒక్కరికి ఫీజు రియంబర్స్‌మెంట్ వస్తే ఆ ఇంట్లో ఈ పథకం వర్తించకపోవటం, విద్యాహక్కు చట్టం క్రింద ప్రయివేట్, కార్పొరేట్ విద్యాసంస్థలలో చదువుతున్న పిల్లల తల్లుల ఖాతాకు బదులుగా విద్యా సంస్థ ఖాతాలో అమలు చేస్తామనటం తదితర నిబంధనలు ప్రభుత్వ చిత్తశుద్ధికి దర్పణం పడుతున్నాయి. క్షేత్రస్థాయిలో విద్యార్థుల నుంచి ఎటువంటి ధృవీకరణ పత్రాలు సేకరించకుండానే పాఠశాలల ప్రారంభం రోజునే తల్లికి వందనం అంటూ ప్రచారం చేసిన ప్రభుత్వం ఆచరణలో నాలుక కరుచుకోక తప్పలేదు. సాంకేతిక లోపాలు కారణం చెప్పి జులై 5 నాటికి పూర్తిగా జమ చేస్తామంటూ చెప్పడం విమర్శలకు దారి తీస్తోంది. ప్రభుత్వం ఇప్పటికైనా చిత్తశుద్ధితో వ్యవహరించి అర్హులైన ప్రతి ఒక్కరికీ తల్లికి వందనం పథకం ఫలాలను అందించాలి. లేకపోతే ప్రజా వ్యతిరేకత మూటగట్టుకోక తప్పదని స్పష్టమవుతోంది.

ఖరీఫ్‌సాగుకు ఊతమేదీ

ఖరీఫ్ సాగుకు సమాయత్తమవుతున్న రైతన్నలకు ప్రభుత్వం చేయూత కరువైంది. అన్నదాత సుఖీభవ పథకం నేటికీ ప్రకటనలను దాటి ఆచరణలో అమలుకు నోచుకోలేదు. రబీ పంట దిగుబడుల కొనుగోలులోనూ, కొనుగోలు చేసిన ధాన్యం నగదు చెల్లింపులోనూ రైతులను ఇబ్బందులకు గురి చేసిన ప్రభుత్వం మరోవైపు బ్యాంకు రుణాల మంజూరులో నిబంధనల కొర్రి పెట్టింది. దీంతో ఈ ఏడాది ఖరీఫ్ సాగు పెట్టుబడి రైతులకు గోరుచుట్టుపై రోకలి పోటులా మారింది. దీంతో ప్రయివేట్ అప్పులకు పరుగులు తీయక తప్పటం లేదు. పరపతి ఉన్న రైతులకు మినహా మిగిలిన వారికి అప్పులు లభించే పరిస్థితి లేదు. కౌలు రైతుల పరిస్థితి ఇంకా దయనీయంగ మారింది. అధిక వడ్డీలకు తెచ్చి సాగుకు ఉపక్రమించక తప్పేలా లేదు. కాల్వలకు నీరు వదిలేయటంతో డెల్టా రైతులు ప్రభుత్వ అక్కరకున్నా సాగును ప్రారంభించినా మెట్ట రైతులు ప్రభుత్వ సాయం కోసం ఎదురు చూస్తున్నారు. ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి త్వరిత గతిన రైతులకు పెట్టుబడి సాయం అందించేందుకు చర్యలు చేపట్టి జిల్లాలోని రైతన్నకు సాగుకు ఊతం ఇవ్వాల్సి ఉంది.

లక్ష్యాల యోగాంధ్ర

పిల్లితో చెలగాటం ఎలుకకు ప్రాణసంకటం అన్న చందంగా క్షేత్రస్థాయి ఉద్యోగులపై యోగాంధ్ర లక్ష్యాల భారం పడింది. ప్రభుత్వ శాఖలలో సిబ్బంది కొరత నేపథ్యంలో ఇప్పటికే పని భారంతో అవస్థలు పడుతున్న ఉద్యోగులకు ప్రభుత్వం యోగాంధ్ర నిర్వహణ అప్పజెప్పింది. క్షేత్రస్థాయిలో నమోదుతో మెదలై గత మూడు వారాలుగా యోగా కార్యక్రమాలకు సామాన్యులను తరలించటం ఉద్యోగులకు కత్తిమీద సాములా మారింది. లక్ష్యానికి అనుగుణంగా ప్రజలను తరలించకపోతే ఎక్కడ ఉన్నతాధికారుల ఆగ్రహానికి గురవుతామోనని ఆందోళన వెంటాడుతోంది. ఈ నేపథ్యంలో క్షేత్రస్థాయి అధికారులు ప్రజలను బుజ్జగించే దశ దాటి బెదిరింపులకు సైతం పాల్పడక తప్పటం లేదు. ఈ కార్యక్రమాలకు రాకపోతే ప్రభుత్వ పథకాలు నిలిపివేస్తామంటూ క్షేత్రస్థాయి రెవెన్యూ సిబ్బంది హెచ్చరించటం విస్మయానికి గురి చేస్తోంది.

గోదారి గలగలలు

క్లోరైడ్ ఫ్యాక్టరీని తక్షణం తెరిపించాలి

ప్రజాశక్తి - గోపాలపురం

సగ్గొండలో అక్రమంగా మూసివేసిన భాగ్యనగర్ క్లోరైడ్ ఫ్యాక్టరీని తక్షణమే తెరవాలని ఐఎఫ్‌టియు రాష్ట్ర ఉపాధ్యక్షులు జె.వెంకటేశ్వరరావు డిమాండ్ చేశారు. ఫ్యాక్టరీ కార్మికులు చేపట్టినరిలే నిరాహార దీక్షల శిబిరాన్ని శనివారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మికులు సంఘం పెట్టుకుంటే నాయకులను తొలగించడం దారుణమన్నారు. అన్ఫైర్ లేబర్ ప్రాక్టీస్ కింద ఇది నేరమని, అందుకు యాజమాన్యాన్ని ప్రాసిక్యూట్ చేసే అధికారం ప్రభుత్వానికి ఉందన్నారు. యాజమాన్యం తక్షణం కార్మికుల సంఘాన్ని గుర్తించి, ఫ్యాక్టరీని తెరిపించి, తొలగించిన కార్మికులను విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. యాజమాన్యం ఫ్యాక్టరీ పెట్టడానికి ప్రభుత్వం నుంచి అనేక రాయితీలు పొందిందని, వందలాది మందికి ఉపాధి కల్పిస్తామని హామీ ఇచ్చిందని, అందుకు విరుద్ధంగా యాజమాన్యం తమ స్వార్ధ ప్రయోజనాల కోసం, బిఐఎఫ్ఆర్‌లో సిక్క్ ఇండస్ట్రియల్‌గా నమోదు చేయించుకుని రాయితీలు పొందాలని చూస్తుందని విమర్శించారు. ఆ ఫ్యాక్టరీ అభివృద్ధికి కార్మికులు ఎనలేని శ్రమ చేశారని, కార్మికుల శ్రమ ద్వారా అనేక రెట్లు లాభాలు పొందిన యాజమాన్యం తన స్వార్ధ ప్రయోజనాల కోసం ఫ్యాక్టరీ మూసివేసి కార్మికులకు తీరని అన్యాయం చేస్తుందని విమర్శించారు. ఈ కార్యక్రమంలో హైకోర్టు న్యాయవాది, యూనియన్ లీగల్ అడ్వైజర్ ఎన్.శ్రీమన్నారాయణ, ఐఎఫ్‌టియు రాష్ట్ర సహాయ కార్యదర్శి ఎం.యేసు, రాష్ట్ర కోశాధికారి జి.ఆదినారాయణమూర్తి, రాష్ట్ర కమిటీ సభ్యులు ఆర్.రాఘవులు, ఎఐకెఎంఎస్ నాయకులు జి.బాలరాజు కార్మికులకు సంఘీభావం తెలిపారు. ఈనెల 16వ తేదీ ఆర్డీవో సమక్షంలో డిప్యూటీ కమిషనర్ ఆఫ్ లేబర్‌తో జరిగే చర్చల్లో ఫ్యాక్టరీ తెరవకపోతే ప్రజా మద్దతుతో భవిష్యత్తు పోరాటాన్ని ఉధృతం చేయడానికి కార్మికుల సిద్ధం కావాలని యూనియన్ లీగల్ అడ్వైజర్ శ్రీమన్నారాయణ పిలుపునిచ్చారు.



కార్మికులతో మాట్లాడుతున్న జె.వెంకటేశ్వరరావు

ఘనంగా గ్రామ దేవత జాతర

ప్రజాశక్తి - కడియం

కడియం గ్రామ దేవత వనువులమ్మ జాతర మహోత్సవం శనివారం సాయంత్రం అంగరంగ వైభవంగా ప్రారంభమయ్యింది. గ్రామం పురవీధుల్లో గరగలు వివిధ వేషధారణలు, బ్యాండ్ మేళాలు, కోయడాన్సుల నృత్యాలతో కళాకారులు చేసిన విన్యాసాలు గ్రామస్తులను అలరించాయి. ఆదివారం జరుగు తీర్థ మహోత్సవాన్ని పురస్కరించుకుని ఆలయాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు టి.ప్రసాదు, టి.బాబురావు, ఎస్.శ్రీనివాసరావు, తోట శ్రీనివాసరావు పాల్గొన్నారు.

సామూహిక యోగా సాధన

ప్రజాశక్తి - యంత్రాంగం

రాజమహేంద్రవరం స్థానిక జిల్లా పోలీస్ కార్యాలయంలో యోగాంధ్రా కార్యక్రమం శనివారం జరిగింది. ఈ సందర్భంగా అడిషనల్ ఎస్‌పి ఎవి.సుబ్బరాజు మాట్లాడుతూ యోగా కేవలం శారీరక వ్యాయామం మాత్రమే కాదని, మానసిక ప్రశాంతత, ఒత్తిడి నియంత్రణకు ఎంతగానో దోహదం చేస్తుందన్నారు. నిత్యం ఒత్తిడికి లోనయ్యే పోలీసు అధికారులు, సిబ్బంది రోజులో కొంత సమయాన్ని యోగాకు కేటాయించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్‌పి(ఎఆర్), డిఎస్‌పి(ఎఆర్) ఎల్. చించిరెడ్డి, ఆర్ఐ సంజీవ్‌కుమార్, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు. అలాగే నగరంలోని డిఎంహెచ్ హైస్కూల్లో జరిగిన కార్యక్రమంలో డిఇఒ కంది వాసుదేవరావు పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం ఎస్.రవికుమార్, అర్బన్ రేంజ్ డిఐ బి.దిలీప్‌కుమార్, సచివాలయ కార్యదర్శి కళాధర్, ఉపాధ్యాయులు ఎల్.ప్రభాకరరావు తదితరులు పాల్గొన్నారు. అలాగే ఆర్ట్స్ కళాశాలలో జరిగిన కార్యక్రమంలో ఆర్‌డిఒ శ్రీకృష్ణనాయక్, ప్రిన్సిపల్ డా.రామచంద్ర పాల్గొని మాట్లాడారు. **ఉండ్రాజవరం** మండలంలోని వేలవెన్నులోని కాటన్ పార్కులో జరిగిన యోగాంధ్రా కార్యక్రమంలో రాష్ట్ర స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఛైర్మన్ బూరుగుపల్లి శేషారావు పాల్గొని మాట్లాడారు. వివిధ రకాల యోగాసనాలు వేసి, యోగా ప్రాధాన్యతను వివరించారు. అనంతరం యోగాపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ పిఎన్‌డి.ప్రసాద్, ఎంపిడిఒ వివివిఎస్.రామారావు, ఇఒపిఆర్‌డి ఆంజనేయశర్మ, వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు. **గోకవరం** మండలంలోని రంపయర్రంపాలెం గ్రామంలో యోగాంధ్రా కార్యక్రమాన్ని నిర్వహించారు. పంచాయతీ సెక్రటరీ గోవింద్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో వివిధ రకాల యోగాసనాలు వేసి, యోగా ప్రాధాన్యతపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు బాదంపూడి ప్రకాష్, వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు. **నిడదవోలు** స్థానిక రోటరీ క్లబ్‌లో జరిగిన యోగాంధ్రా కార్యక్రమాన్ని మున్సిపల్ ఛైర్మన్ భూపతి ఆదినారాయణ ప్రారంభించారు. ఈ కార్యక్రమములో వైస్ ఛైర్మన్ వసీరుద్దీన్, వార్డు సభ్యులు, మునిసిపల్ కమిషనర్ కృష్ణవేణి, యోగా మాస్టర్ ట్రైనర్ సుబ్బారావు, వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు. **కొవ్వూరు** పట్టణంలో గోష్పాద క్షేత్రంలో గోదావరి నది ఒడ్డున యోగాంధ్ర కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో ఎంఎల్ఎ ముప్పిడి వెంకటేశ్వర రావు, కలెక్టర్ పి.ప్రశాంతి, జాయింట్ కలెక్టర్ చిన్నరాముడు, ఆర్‌డిఒ రాణిసుష్మిత, కమిషనర్ టి.నాగేంద్రకుమార్, మున్సిపల్ ఛైర్ పర్సన్ భావన రత్నకుమారి, టిడిపి టూమెన్ కమిటీ సభ్యులు కంటమని రామకృష్ణ, జొన్నలగడ్డ సుబ్బరాయుడుచౌదరి, మున్సిపల్ మాజీ ఛైర్మన్ సూరపనేని చిన్ని, అర్బన్ బ్యాంక్ ఛైర్మన్ మద్దిపట్ల శివరామకష్ణ, కూటమి నాయకులు, అధికారులు పాల్గొన్నారు.


కొవ్వూరులో యోగాంధ్రా కార్యక్రమంలో ఆసనాలు చేస్తున్న ప్రజలు

నీట్ ఫలితాల్లో తిరుమల విజయకేతనం

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

దేశవ్యాప్తంగా నిర్వహించిన మెడికల్ ప్రవేశ పరీక్ష నీట్లో తమ తిరుమల ఐఐటి, మెడికల్ అకాడమి విద్యార్థులు అత్యుత్తమ ఫలితాలు సాధించారని తిరుమల విద్యాసంస్థల ఛైర్మన్ నున్న తిరుమలరావు తెలిపారు. ఓపెన్ కేటగిరీలో డి.కార్తీక్‌రామ్‌కిరీటికి ఎపి స్టేట్ ఫస్ట్ ర్యాంకుతో పాటు ఆలిండియా 19వ ర్యాంకు సాధించాడని, వివిధ కేటగిరీలలో కె.ఈప్సిత్ కశ్యప్ 12వ ర్యాంకు, డి.కార్తీక్ రామ్ కిరీటి 18వ ర్యాంకు, టి.సాహితి 32వ ర్యాంకు, కెవివి.నాగసాయి పవన్ 154వ ర్యాంకు, ఎం.సూర్య సంతోష్‌రెడ్డి 880వ ర్యాంకు, ఎల్.అభిషేక్ 888 ర్యాంకు సాధించారని 310 మంది పైన విద్యార్థులు ఎంబిబిఎస్ సీట్లు సాధించగల్గినట్లు తెలిపారు. ఈ విజయాలకు కారణమైన అధ్యాపకులను, విద్యార్థులను ఆయన అభినందించారు.



ర్యాంకర్లను అభినందిస్తున్న తిరుమలరావు



చేగువేరాకు నివాళులర్పిస్తున్న జువ్వల రాంబాబు

సిపిఎం ఆధ్వర్యంలో చేగువేరా జయంతి

ప్రజాశక్తి - నిడదవోలు

సిపిఎం ఆధ్వర్యంలో చేగువేరా జయంతిని నిర్వహించారు. శనివారం అంబేద్కర్ చౌక్ వద్ద జరిగిన ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు జువ్వల రాంబాబు మాట్లాడుతూ చే గువేరా 1928జూన్ 14 అర్జెంటీనా రొసారియోలో జన్మించి వైద్య శాస్త్రంలో పట్టా పొందారని అన్నారు. 1967అక్టోబర్ 9న విప్లవ ప్రతిఘాతకులు బొలీవియా సైన్యం చేత చంపబడ్డారని, ప్రపంచంలో ఎక్కడ విముక్తి పోరాటాలు జరిగినా వారికి అండగా ఉన్నారన్నారు. ఆయన్ని స్మరించుకోవడం మన అందరి బాధ్యత అని అన్నారు. ఈ కార్యక్రమంలో చినబాబు, నాగరాజు, గండి శేఖర్, టి.విఘ్నేష్, ఎన్.దుర్గాప్రసాద్, లక్ష్మణరావు, గండి మాలీ పాల్గొన్నారు.

వారంలో 2 రోజులు వినతులు స్వీకరిస్తా

ప్రజాశక్తి - తాళ్లపూడి

వారంలో రెండు రోజులు ప్రజల నుంచి వినతులు స్వీకరించనున్నట్లు ఎస్‌సి కమిషన్ ఛైర్మన్ కెఎస్.జవహర్ తెలిపారు. శనివారం మండలానికి వచ్చిన ఆయన మీడియాతో మాట్లాడుతూ ఎస్‌సిలకు అన్యాయం జరిగితే రాజధాని అమరావతిలో తన కార్యాలయంలో ప్రతి మంగళ, బుధవారాల్లో ఆ వ్యక్తుల నుంచి వినతులు స్వీకరిస్తానని అన్నారు. వచ్చిన ఫిర్యాదులను సమీక్షించడానికి గురు, శుక్రవారాల్లో ఆయా ప్రాంతాల్లో పర్యటిస్తానని తెలిపారు. ఎస్‌సి కమిషన్ ఛైర్మన్‌గా అన్నివేళలా దళితులకు అందుబాటులో ఉంటానని ఫోన్ చేస్తే పలుకుతానని అన్నారు. ఎస్‌సి కమిషన్ విధుల పట్ల ప్రజలకు అవగాహన కల్పించేందుకు సమయం కేటాయిస్తానని అన్నారు. ఈ సమావేశంలో తెలుగు యువత రాష్ట్ర నాయ కులు కె.ఆశిష్‌లాల్, టిడిపి మండల నాయకులు ఎ.రాంబాబు, ఎన్.సురేంద్ర పాల్గొన్నారు.


విలేకరులతో మాట్లాడుతున్న జవహర్



రక్తదాతను అభినందిస్తున్న సేవా సమితి నిర్వహకులు

సేవా పథంలో 'చిరు సేవా సమితి'

ప్రజాశక్తి - కడియం

గత 25 ఏళ్లుగా సేవా పథంలో చిరు సేవా సమితి పయనిస్తుందని సేవా సమితి నిర్వహకులు గెడ్డం శివ అన్నారు. శనివారం క్తదాతల దినోత్సవాన్ని పురష్కరించుకుని చిరు సేవా సమితి ఆధ్వర్యంలో రాజమహేంద్రవరం ధన్వంతరి బ్లడ్ బ్యాంక్‌లో రక్తదానం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతకొన్నేళ్లుగా ప్రతి మూడు నెలలకు ఒకసారి క్రమం తప్పకుండా రక్తదానం చేస్తూ ఎందరో యువతకు ఆదర్శంగా నిలుస్తున్న చిరు సేవా సమితి సభ్యులు తాడాల ప్రేమ్, నాగిరెడ్డి అయ్యప్పలను అభినందించారు. వీరికి జ్ఞాపికలను అందించి వారి సేవల్ని ప్రశంసించారు.

కైగాల కుటుంబాన్ని పరామర్శించిన ఎంఎల్ఎ

ప్రజాశక్తి - తాళ్లపూడి

మాతృవియోగంతో భాదపడుతున్న టిడిపి సీనియర్ నాయకులు కైకాల బ్రదర్స్‌ను ఎంఎల్ఎ ముప్పిడి వెంకటేశ్వరరావు పరామర్శించారు. మండలంలోని వేగేశ్వరపురం గ్రామానికి చెందిన కైకాల రాంబాబు, శ్రీనివాస్ మాతృమూర్తి రత్తమ్మ(90) ఇటీవల మృతి చెందారు. ఈ సమాచారాన్ని తెలుసుకున్న ఎంఎల్ఎ ముప్పిడి వెంకటేశ్వరరావు శనివారం వారి స్వగృహానికి వచ్చి ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సంతాపాన్ని తెలిపారు. ఈ పర్యటనలో టిడిపి నాయకులు జొన్నలగడ్డ సుబ్బరాయ చౌదరి, కంఠమణి రామకృష్ణ, సూరపనేని చిన్ని, నామన పరమేశ్వరరావు, కోడి శంకరం, తదితరులు పాల్గొన్నారు.


గైగాల కుటుంబాన్ని పరామర్శిస్తున్న ఎంఎల్ఎ ముప్పిడి

మేరీ మాత ఆలయంలో జవహర్

ప్రజాశక్తి - తాళ్లపూడి

ఎపి ఎస్‌సి కమిషన్ ఛైర్మన్ కెఎస్.జవహర్ శనివారం మండలంలోని వేగేశ్వరపురం గ్రామంలోని గోదావరి మేరీమాత ఆలయాన్ని సందర్శించారు. ఫాదర్ జాన్ ఆయనకు ఘనంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయనతో కేక్ కట్ చేయించి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కొత్తపల్లి ఆశిష్‌లాల్, పసలపూడి బోసు, ఆత్కూరి రాంబాబు, నామా సురేంద్రకుమార్, కొప్పాక నరసయ్య, తిగిరిపల్లి శ్రీను, తదితరులు పాల్గొన్నారు.